

రెండోరోజూ ఏసీబీ తనిఖీలు

కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం కూడా విస్తృత తనిఖీలు చేశారు. అనధికార నగదు లావాదేవీలు, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం, అధికారుల అవినీతి వ్యవహారాలను గుర్తించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,320
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,566
3 శాతం జీఎస్టీతో	రూ.5,733
నవర (8 గ్రా)	రూ.45,864



వాతావరణం

గురువారం గాలిలో 67 శాతం తేమ ఉంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవు. శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కామాక్షితాయికి బంగారు ఆభరణాల బహూకరణ



బంగారు హారం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి దాతలు గురువారం బంగారు ఆభరణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ చెన్నైకి చెందిన నాయుడు కేశవరెడ్డి – కామాక్షమ్మ దంపతులు సుమారు రూ.16 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను బహూకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించి, దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు.


రేపు జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశపరీక్ష ఈనెల 29న ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా జరుగుతుందని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. నవోదయ విద్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. మొత్తం 19 పరీక్ష కేంద్రాలకు సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్లు, సెంట్రల్ లెవల్ అబ్జర్వర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు.

సోమశిలలో 51.331 టీఎంసీలు



చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 51.331టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 195 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 450, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించండి

- జెడ్పీ సీఈఓ చిరంజీవి



యాప్‌లో వివరాలు చూస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

బుచ్చిరెడ్డిపాళెం: సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆదేశించారు. మండలంలోని రేబాల సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, నాడు–నేడు పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోజూ తప్పనిసరిగా సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. ఎవరికైనా అందకుంటే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ శ్యామ్‌ప్రసాద్, కార్యదర్శి శ్యామ్ ఉన్నారు.

ఎస్జీటీలు సర్టిఫికెట్లు పంపాలి

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ, జెడ్పీ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు (స్పెషల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతులు పొందేందుకు అర్హత కలిగిన ఎస్జీటీలు వారి విద్యార్హత సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్ల కాపీలను ఎంఈఓల ద్వారా డీఈఓ కార్యాలయానికి శుక్రవారం ఉదయం తప్పనిసరిగా పంపాలని డీఈఓ గంగాభవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి పేర్లను స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతుల సీనియారిటీ జాబితాలో నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

మొక్కలకూ వైద్యం



మనకు ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదిస్తాం. ఆయన డయాగ్నోస్ చేసి వ్యాధి కారకాలు గుర్తించి తగిన మందులు ఇస్తే వాటితో ఉపశమనం పొందుతాం. ఇదే విధంగా ఇక నుంచి మొక్కలకూ అనారోగ్యం ఏర్పడితే (తెగుళ్లు సోకితే) వెంటనే డయాగ్నోస్ చేసి తగిన మందులు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం మండల స్థాయిలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది.

మండల స్థాయిలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లు

- పల్లెలకు మొక్కల డాక్టర్లు
- ఆర్బీకేల్లో నియామకానికి చర్యలు
- పంటలకు సోకే చీడపీడలకు పీహెచ్‌డీసీల ద్వారా పరిష్కారం

సాక్షి, నెల్లూరు డెస్క్: పాడి పంటలతో పల్లెలు కళకళలాడేలా.. ప్రజలు సిరి సంపదలతో సుఖసంతోషాలతో జీవించేలా.. రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రైతులు బాగుపడాలనే ఉద్దేశంతో పంటల ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టింది. రైతు పొలంలో వేసే ప్రతి పంటకు ఎలాంటి చీడపీడలు ఆశించకుండా బాగా పెరిగి మంచి దిగుబడులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటోంది. గ్రామస్థాయిలో ఉండే వీఏఏ (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్)లకు సపోర్టుగా పీహెచ్‌డీసీ (ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్స్) డాక్టర్లను నియమిస్తోంది. వీరు నేరుగా పొలంలోనే రైతులకు సూచనలు, సలహాలు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తోంది.

వీఏఏలకు ప్రత్యేక బాధ్యతలు

ప్రస్తుతం జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. వీరు రైతుల పొలాల్లోకి వెళ్లి పంటలకు చీడపీడలు ఏవైనా ఆశించాయా? పైరు ఏపుగా పెరుగుతోందా.. లేదా? పైరుకు పోషకాలు సక్రమంగా అందుతున్నాయా? తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. పైరు పెరుగుదలలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా రైతులకు వివరించి ఏ మందులు వాడాలో తెలియజేస్తున్నారు. ప్రభుత్వం వీరికి సపోర్టుగా కొత్త వారిని నియమిస్తోంది.

పీహెచ్‌డీసీ డాక్టర్ల నియామకం

ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వీఏఏలు రైతులకు ఎరువులు, పురుగు మందులు, వివిధ రకాల విత్తనాలు అందించే విధంగా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా వీఏఏలు పొలంలోకి వెళ్లి రైతుల పంటలను పరిశీలించేలా ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. వారికి సపోర్టుగా కొత్తగా వ్యవసాయ విద్య చదివిన వారిని పీహెచ్‌డీసీ (ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్) డాక్టర్లుగా నియమిస్తున్నారు. జిల్లాలో 561 రైతు భరోసా కేంద్రాలుండగా అందులో అర్బన్ ప్రాంతాల్లో 19 ఉన్నాయి. అర్బన్ ప్రాంతాల్లో మినహాయించి గ్రామీణ ప్రాంతాల్లో ఉండే 542 ఆర్‌బీకేల్లో పీహెచ్‌డీసీ డాక్టర్లను నియమిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో అందుబాటులోకి..

మొదటి దశలో మండలానికి ఒకటి చొప్పున ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి వచ్చే ఖరీఫ్ (2023–24) నాటికి రైతులకు అందుబాటులోకి వస్తాయి. ప్రతి మండలంలో సొంత భవనంలో కొనసాగుతున్న రైతు భరోసా కేంద్రాన్ని పీహెచ్‌డీసీగా గుర్తిస్తారు. పీహెచ్‌డీసీ డాక్టర్లుగా మొదటి ప్రాధాన్యత కింద అగ్రికల్చర్ ఎమ్మెస్సీ/హార్టికల్చర్ ఎమ్మెస్సీ చేసిన వారిని ఆర్బీకే ఇన్‌చార్జులుగా ఎంపిక చేస్తారు. ఈ అర్హతలు కలిగిన వారు లేకపోతే అగ్రికల్చర్ బీఎస్సీ/హార్టికల్చర్ బీఎస్సీ చేసిన వారిని ఎంపిక చేస్తారు. వీరు కూడా లేకపోతే అగ్రికల్చర్/హార్టికల్చర్‌లో డిప్లొమా చేసిన వారిని ఎంపిక చేస్తారు. వీరి ఎంపికకు సంబంధించి ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి.

సేద్యంపై అవగాహన



పీహెచ్‌డీసీ డాక్టర్లకు అనుబంధంగా పొలంబడి ట్రైనర్స్, తోటబడి ట్రైనర్స్ ఉంటారు. వీరికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు సేద్య పద్ధతులు, పంటలకు చీడపీడలు, వాటి నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఎటువంటి సమస్య ఉత్పన్నమైనా పీహెచ్‌డీసీలో పరిష్కారం ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

పొలాల్లోకి నేరుగా శాస్త్రవేత్తలు

వీఏఏలు లేదా పీహెచ్‌డీసీ డాక్టర్లు పొలంలోకి వెళ్లి పంటలకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే పూర్తిగా తెలుసుకుని, ఆ వివరాలను అటు వ్యవసాయ అధికారుల దృష్టికి, ఇటు శాస్త్రవేత్తలకు సమాచారం ఇవ్వనున్నారు. సమస్య తీవ్రంగా ఉంటే నేరుగా శాస్త్రవేత్తలే పొలంలోకి వెళ్లి పరిశీలిస్తారు. తెగుళ్ల నుంచి పంటలను కాపాడాలంటే ఎటువంటి చర్యలు తీసుకోవాలో నేరుగా రైతులకే తెలియజేస్తారు. మొత్తంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలను తీసుకుంటోంది.

త్వరలోనే అమల్లోకి..



ఆర్‌బీకేల్లోని వీఏఏలు రైతుల పొలాల్లోకి వెళ్లి పైరు ఆరోగ్యం పరిశీలించేలా ప్రత్యేక బాధ్యతలను అప్పగించాం. వారికి సపోర్టుగా పీహెచ్‌డీసీలకు డాక్టర్లను తీసుకునే ప్రక్రియ కూడా ప్రారంభించాం. త్వరలోనే నియామకాలు పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం. దీంతో రైతులకు మరింత మేలు జరిగి దిగుబడులు పెరుగుతాయి.

– సుధాకర్‌రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

రైతులకు ఎంతోమేలు



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోంది. ఆర్బీకేలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వాటి ద్వారా కొత్తగా ప్లాంట్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో రైతుల సాగు పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు చేసేందుకు అర్హులైన వారిని నియమించేందుకు చర్యలు తీసుకోవడం మంచి పరిణామం.

– పార్లపల్లి శ్రీనివాసులురెడ్డి, రైతు, నల్లపాళెం, పొదలకూరు మండలం

సాంకేతిక సేద్యం



సాంకేతికతతోపాటు ఆధునిక వ్యవసాయానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. ఆర్బీకేల్లో కొత్తగా ఎమ్మెస్సీ, ఏజీ బీఎస్సీ చదివిన వారిని ప్లాంట్ హెల్త్ క్లినిక్‌ల కోసం నియమిస్తుండడం సంతోషదాయకం. రైతులు సాగు చేసే పంటల చీడపీడల నివారణను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలు కలుగుతుంది.

– కొమ్మి సుబ్బానాయుడు, రైతు, అమ్మవారిపాళెం, పొదలకూరు మండలం

మహా కుంభాభిషేక వేడుకలు ప్రారంభం

- పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రాజారెడ్డి, పూజిత దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో గురువారం మహా కుంభాభిషేక వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయానికి విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొలన్ రాజారెడ్డి, పూజిత దంపతులకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉభయకర్తలైన వేమిరెడ్డి దంపతులు, కొలన్ రాజారెడ్డి దంపతులు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కలిసి ఆలయంలో కొలువైన గణపతి స్వామి, సుబ్రహ్మణ్యంస్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయికి అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంభాభిషేక వేడుకల్లో భాగంగా ముందుగా గోపూజ చేశారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన గణపతి పూజలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, సీఐ రామారావు, ఎస్సై వీరప్రతాప్, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మ, సుప్రజ, విమల, కామేశ్వరమ్మ, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): వచ్చే నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు పెంచలకోనలో పెనుశిల నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించామన్నారు. ఎంతమంది భక్తులు వచ్చినా చిన్న పొరపాటు కూడా జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

అనేక అభివృద్ధి పనులు

తాను సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వెంకటగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేసినట్లు రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇంకా చేయాల్సిన పనుల గురించి ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధానంగా వెంకటగిరిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పీఏ కుమారుడు కొన్ని కాంట్రాక్ట్ పనులు చేశాడన్నారు. అయితే నాసిరకంగా జరగడంతో కూలిపోయినట్లు తెలియజేశారు. వాటిపై ప్రత్యేక విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కేసుల దర్యాప్తు

- ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి



రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): కేసులను పారదర్శకంగా దర్యాప్తు చేయాలని ఎస్పీ డాక్టర్ కె. తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో గురువారం ఎస్పీ సిబ్బందితో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ తదితర కేసులను సర్కిల్స్ వారీగా సమీక్షించారు. పలు కేసులు పెండింగ్‌లో ఉండడంతో అందుకు గల కారణాలు తెలుసుకున్నారు. పెండెన్సీని తగ్గించేందుకు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో పారదర్శకతే ప్రామాణికమన్నారు. కేసుల నమోదు, నిందితుల అరెస్ట్, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు వరకు లోతుగా దర్యాప్తు చేసి కోర్టులో అభియోగపత్రాలు త్వరితగతిన దాఖలు చేయాలన్నా రు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎస్‌హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, లోక్‌అదాలత్ ఫిర్యాదులపై వెంటనే స్పందించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. హత్య లు, హత్యాయత్నాలు, మర్డర్ ఫర్ గెయిన్, పోక్సో, ఎన్‌డీపీఎస్, అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్, పేకాట, మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరాపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఆస్తి, దొంగతనాల కేసుల్లో ప్రత్యేక బృందాలతో నిందితులను గుర్తించి వారి నుంచి చోరీ సొత్తు పూర్తిస్థాయిలో రికవరీ చేయాలన్నారు. సైబర్ నేరాలు, నకిలీ లోన్‌యాప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం దర్యాప్తులో ప్రతిభ, నిందితుల సత్వర అరెస్ట్, కేసుల పెండెన్సీ తగ్గింపు, సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. బదిలీపై వెళ్తున్న కందుకూరు డీఎస్పీ కండే శ్రీనివాసులను సత్కరించారు. తొలుత సిబ్బంది పరిచయ కార్యక్రమం నిర్వహించారు. నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించి పోలీస్ శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌తో అప్పలపాలు

- బైక్‌ను కుదువపెట్టిన యువకుడు
- విడిపించేందుకు రూ.20 వేలు ఇచ్చిన తల్లిదండ్రులు
- నగదుతో యువకుడి పరారీ

నెల్లూరు(క్రైమ్): క్రికెట్ బెట్టింగ్‌తో ఓ యువకుడు అప్పులపాలయ్యాడు. కుదువ నుంచి బైక్‌ను విడిపించేందుకు తల్లిదండ్రులు ఇచ్చిన నగదుతో అతను పరారైన ఘటన నెల్లూరులో ఉమ్మారెడ్డిగుంటలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మారెడ్డిగుంటలో సుధాకర్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమారుడు నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఆ యువకుడికి మోటార్‌బైక్ ఉంది. ఈ క్రమంలో క్రికెట్ బెట్టింగ్‌లతో అప్పులపాలయ్యాడు. ఇటీవల బైక్‌ను కుదువపెట్టి అప్పులు తీర్చాడు. కొద్దిరోజులుగా బైక్ కనిపించకపోవడంతో ఈనెల 23వ తేదీన సుధాకర్ కుమారుడిని నిలదీయగా బెట్టింగ్‌లో అప్పులపాలవడం, బైక్‌ను కుదువపెట్టి అప్పులు తీర్చిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో తండ్రి మందలించి బైక్‌ను విడిపించాలని రూ.20 వేలు ఇచ్చాడు. యువకుడు ఆ నగదుతో పరారయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేడ్కర్

- బాబాసాహెబ్ మనవడు యశ్వంత్‌రావు



మాట్లాడుతున్న డాక్టర్ భీమ్‌రావు యశ్వంత్‌రావు అంబేడ్కర్

కావలి రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని ఆయన మనవడు డాక్టర్ భీమ్‌రావు యశ్వంత్‌రావు అంబేడ్కర్ తెలిపారు. కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామంలో బాబాసాహెబ్ విగ్రహావిష్కరణ నిమిత్తం గురువారం యశ్వంత్‌రావు కావలికి వచ్చారు. ముందుగా పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో ఉన్న బుద్ధవిహార్ నుంచి బైక్ ర్యాలీ చేశారు. ట్రంక్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం చలంచర్ల గ్రామానికి బైక్ ర్యాలీ నిర్వహించి విగ్రహాన్ని ఆవిష్కరించారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఐఏఎస్ అధికారి విజయకుమార్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ శీనానాయక్ విచ్చేశారు. ఈ సందర్భంగా యశ్వంత్‌రావు మాట్లాడుతూ బాబాసాహెబ్ భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడని చెప్పారు. యువత ఆయన ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. సమాజం పట్ల బాధ్యతగా మెలగాలన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ వల్ల దేశంలో పేదలు బాగా చదువుకుని విద్యావంతులు అవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అంబేడ్కర్ తత్వవేత్త, హైకోర్టు న్యాయవాది డాక్టర్ పీవీ రత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు, బుద్ధవిహార్ యూత్, అంబేడ్కర్ యూత్, పలు స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



రైతులకు అండగా..

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అన్నివిధాలుగా అండగా ఉంది. వారి కోసం నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం సమీపంలో రూ.2.40 కోట్లతో నిర్మించిన జీవన, సేంద్రియ ఎరువుల నాణ్యత నిర్ధారణ ల్యాబ్‌ను గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. – నెల్లూరు(సెంట్రల్)

ఎండా కాలం.. అప్రమత్తత అవసరం

- అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

నెల్లూరు(క్రైమ్) : రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతిఒక్కరూ అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులు సూచిస్తున్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గడిచిన ఆరు రోజులుగా సిబ్బంది అపార్ట్‌మెంట్‌లు, కర్మాగారాలు, షాపింగ్‌మాల్స్, విద్యాసంస్థలు, హాస్పిటల్స్ తదితరాల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేశారు.

వంటగదిలో..

స్టౌవ్‌ను నేలమట్టానికి వీలైనంత ఎత్తులో ఉంచుకోవాలి. అగ్గిపెట్టెలు, కిరోసిన్, క్యాలెండర్లు, వస్త్రాలు తదితర మండే స్వభావం కలిగిన వాటిని స్టౌవ్‌కు దూరంగా ఉంచాలి. అలాగే వంట చేసే సమయంలో వదులుగా, వేలాడే వస్త్రాలు ధరించరాదు. అగ్గిపుల్ల లేదా లైటర్‌ను వెలిగించిన తర్వాత మాత్రమే గ్యాస్ బర్నల్ నాబ్‌ను తిప్పాలి. వంట పూర్తయ్యాక సిలిండర్ వాల్వ్‌ను బర్నల్ వాల్‌ను నిలిపివేయాలి.



క్షతగాత్రులను రోప్ సాయంతో కిందకు దించడంపై మాక్‌డ్రిల్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

గ్యాస్ లీకైతే..

- అనుకోని పరిస్థితుల్లో గ్యాస్ లీకయితే వెంటనే రెగ్యులేటర్‌లు ఆపివేయాలి. ఎలక్ట్రికల్ స్విచ్‌లను ఆన్, ఆఫ్ చేయొద్దు. దేవుని దీపాలు, అగర్‌బత్తీలు ఆర్పివేయాలి. గాలి, వెలుతురు కోసం అన్ని కిటికీలు, తలుపులను తెరవాలి.
- గ్యాస్‌లీక్ వల్ల అగ్నిప్రమాదం సంభవిస్తే అవకాశముంటే రెగ్యులేటర్ వాల్వ్‌ను ఆఫ్ చేయాలి. అవకాశం లేకపోతే తడిపిన గోతంపట్టను లేదా తడి బట్టను మండుతున్న సిలిండర్‌పై వేయాలి. మంట ఆరిన తరువాత సిలిండర్‌ను ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లాలి.

వాహన ప్రయాణంలో..

కారు లేదా ఇతర వాహనాల్లో సుదూర ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో వాహనంపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావం పడే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ ట్యాంకును పూర్తిగా నింపడం ప్రమాదకరం. ఎండ వేడిమికి రోడ్డపై తారు వేడెక్కుతుంది. దీనికి మితిమీరిన వేగం తోడైతే టైర్లు పేలిపోవడం, వాహనం అదుపు తప్పడం వంటివి జరగొచ్చు. టైర్లలో గాలి ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం మంచిది. గంటల తరబడి ప్రయాణించినప్పుడు ఇంజిన్ వేడెక్కడం, వాహనంలోని వైరింగ్ కాలిపోవడం వల్ల అకస్మాత్తుగా మంటలు వ్యాపిస్తాయి. సెల్ఫ్ స్టార్టర్, లైట్లు, టేప్ రికార్డులు ఇలా అవసరమైన వాటికి ఉన్న వైర్లు వేడి వల్ల షార్ట్‌సర్క్యూట్ అవుతాయి. బ్యాటరీ, ఫ్యూజ్, విద్యుత్ వైర్లు నాణ్యమైనవి వాడాలి. వాహనంలో వైరింగ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. మధ్యాహ్న సమయాల్లో వాహనానికి తగినంత విరామం ఇచ్చి ప్రయాణించడం ఉత్తమం.

అత్యవసర వేళల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు		
కేంద్రం	కార్యాలయ నంబర్	అధికారి సెల్ నంబర్
నెల్లూరు	0861-2331051	99637 34284
కావలి	08626-243101	99637 34286
ఉదయగిరి	08620-229251	99637 35314
ఆత్మకూరు	08627-221222	99637 34394
కందుకూరు	08598-223399	99637 33252

విద్యాసంస్థలు, భవనాలు, హాస్పిటల్స్‌లో..

తాటాకులు, గడ్డితో చేసిన పైకప్పును వాడరాదు, ఆర్‌సీసీ స్లాబ్‌లను మాత్రమే పైకప్పుగా వాడాలి. భవనం నుంచి బయటకు వెళ్లే మార్గాల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలి. అత్యవసర మార్గాలకు, ఫైర్ డోర్‌లకు తాళాలు వేయకూడదు. ఎగ్జిట్ సైన్‌బోర్డులు ఏర్పాటు చేసుకోవాలి. నేషనల్ బిల్డింగ్ కోడ్ ప్రకారం అగ్నిమాపక పరికరాలు ఏర్పాటుచేసి అవి ఎల్లప్పుడు పనిచేసే విధంగా ఉంచుకోవాలి. సిబ్బంది అందరికి ఫైర్ ఎక్విప్‌మెంట్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలి.

ఇతర జాగ్రత్తలు

గ్రామాల్లో వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలి. గుడిసె, గుడిసెకు మధ్య కనీస దూరం ఉండాలి. బహిరంగ మంటలను అనుమతించరాదు. దీని వల్ల నిప్పురవ్వలు ఎగిరి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. విద్యుత్ తీగలకు దగ్గరల్లో గడ్డివాములు ఏర్పాటు చేయరాదు. ఏదైనా గుడిసెకు నిప్పంటుకుంటే పక్కనే ఉన్న గుడిసెలు, పూరిళ్లు, గడ్డివాములను పూర్తిగా నీళ్లతో తడపాలి. పంటపొల్లాలో మార్పిడి అయిన తర్వాత ఎండుగడ్డిని, పాడి మొక్కజొన్నను, చొప్పదంటు తదితరాలను తగులబెట్టే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. గడ్డివాములను చిన్న, చిన్నవిగా ఏర్పాటు చేసుకోవాలి.

స్వశక్తితో రాణిస్తే మంచి భవిష్యత్తు

- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

వెంకటాచలం : యువత స్వశక్తితో రాణించి మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టు ప్రాంగణంలో ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువకులతో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో వెంకయ్యనాయుడు పాల్గొని, ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచి తల్లిదండ్రులను, మాతృభూమిని, మాతృదేశాన్ని గౌరవించడం అలవరుచుకోవాలని సూచించారు. చదువును నిర్లక్ష్యం చేయరాదని కోరారు. ఎంచుకున్న రంగాల్లో వృత్తి నైపుణ్యత సాధించాలన్నారు. కేవలం ప్రభుత్వాలు మాత్రమే అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించలేవని, స్వచ్ఛంద సంస్థలు, సంపన్నులు ముందుకొచ్చి నిరుద్యోగులకు వివిధ రకాల ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యువత పాశ్చాత్య వ్యామోహంలో పడి చెడు మార్గాల వైపు వెళ్లకూడదని, మంచి మార్గాల్లో పయనించాలన్నారు. ఇతర భాషలు నేర్చుకోవడం అవసరమేనని, కానీ తెలుగును నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో ముప్పవరపు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పైపుల ద్వారా ఎరువుల వాడకం

- ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు



డ్రిప్ పైపులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసులు

పొదలకూరు : ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులు డ్రిప్ పైపుల ద్వారా ఎరువులను వినియోగించుకోవాలని ఏపీఎంఐపీ పీడీ బి.శ్రీనివాసులు సూచించారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో నిర్వహించిన రైతు సదస్సుకు పీడీ గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్రిప్ పైపుల వాడకంపై అవగాహన కల్పించారు. రైతులు డ్రిప్ పైపుల ద్వారా ఎరువులను పంపే విధానాన్ని అలవాటు చేసుకోవాలని, తద్వారా ప్రతిచెట్టు పాదుకు నీటితోపాటు, ఎరువులు చేరతాయని తెలిపారు. ఇందువల్ల సమయంతోపాటు, ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. డ్రిప్‌పైపుల ఏర్పాటు చేసుకోవాలనుకునే రైతులు ఆయా ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై పైపుల కొనుగోలు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జైన్, ఫినోలెక్స్, సిగ్నెట్, సుధాకర్, నింబస్, కాప్టెయిన్, నెటాఫిమ్ కంపెనీల డ్రిప్‌పైపులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పైపులు ఏడేళ్ల వరకు పనిచేస్తాయని, సబ్సిడీపై ఒక పర్యాయం డ్రిప్‌పైపులను తీసుకున్న రైతులు తిరిగి ఏడేళ్ల వరకు సబ్సిడీపై పైపులను తీసుకునేందుకు వీలుండదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఎంఐ ఇంజినీర్ బాలాజీరెడ్డి, స్రవంతి, నరేష్ పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	: 120
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 136

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20



7న సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వచ్చే నెల 7వ తేదీన సాఫ్ట్‌బాల్ జిల్లా జూనియర్ బాలుర, బాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తామని సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, కామేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. 2006 సంవత్సరం జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 25వ తేదీ నుంచి అన్నమయ్య జిల్లాలో జరిగే అంతర్ జిల్లాల పోటీలకు నెల్లూరు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఇతర వివరాలకు 97036 54315, 99660 63377 నంబర్లను సంప్రదించాలన్నారు.

4 నుంచి క్రికెట్ సమ్మర్ క్యాంప్

నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల నాలుగో తేదీ నుంచి సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తామని ఆ అసోసియేషన్ కార్యదర్శి డి.నిఖిలేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంప్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. ఇతర వివరాలకు 94909 49729 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రెండో రోజూ ఏసీబీ తనిఖీలు

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విస్తృతంగా తనిఖీలు
- రూ.5 లక్షలకు పైగా అనధికార లావాదేవీల గుర్తింపు
- అధిక ఫిర్యాదుల వల్లే దాడులు చేశామన్న ఏసీబీ డీఎస్పీ మోహన్



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ మోహన్

కందుకూరు : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు రెండు రోజుల పాటు విస్తృత తనిఖీలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం మొదలైన తనిఖీలు గురువారం సాయంత్రం ఏడు గంటల వరకు కొనసాగాయి. కార్యాలయంలో అనధికార నగదు లావాదేవీలు, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం, అధికారుల అవినీతి వ్యవహారాలను ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటిపై సబ్‌రిజిస్ట్రార్ సుల్తాన్‌బాషా సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మోహన్ విలేకరులతో మాట్లాడుతూ అధికంగా ఫిర్యాదులు రావడం వల్లే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు చేశామన్నారు. రెండు రోజులపాటు జరిగిన దాడుల్లో ఉన్నం సతీష్ అనే డాక్యుమెంట్ రైటర్ నుంచి రూ.97 వేలు, సబ్ రిజిస్ట్రార్ వద్ద పనిచేసే ఆఫీస్ సబార్డినేట్ ఫయాజ్ ఫోన్ నుంచి రూ.1.30 లక్షలు సబ్‌రిజిస్ట్రార్‌కు బదిలీ చేసినట్లు గుర్తించామన్నారు. అలాగే సబ్‌రిజిస్ట్రార్ బ్యాంకు అకౌంట్‌కు దాదాపు రూ.3 లక్షల వరకు లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. వీటిపై వారు సరైన సమాధానం చెప్పడం లేదని, ఈ లావాదేవీలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాల్సి ఉందన్నారు. అలాగే సబ్‌రిజిస్ట్రార్ బ్యాంకు అకౌంట్‌లను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉందన్నారు.

ప్రైవేట్ వ్యక్తులదే రాజ్యం

కార్యాలయంలో ప్రభుత్వ సిబ్బంది కంటే ప్రైవేట్ వ్యక్తులే ఎక్కువ మంది పనిచేస్తున్నట్లు గుర్తించామని డీఎస్పీ తెలిపారు. డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయ ఆవరణలో ఉండకూడదని, అయినా వారంతా కార్యాలయ ఆవరణలోనే ఉంటున్నట్లు గుర్తించామన్నారు. కార్యాలయంలో మొత్తం నాలుగు సీసీ కెమెరాలు ఉంటే వాటిలో కేవలం రెండు మాత్రమే పనిచేస్తున్నట్లు తెలిపారు. వీటిలో కార్యాలయం లోపల ఉన్న సీసీ కెమెరాను పరిశీలించినప్పుడు రికార్డు కావడం లేదని తెలిసిందన్నారు. రికార్డు కాకుండా సీసీ కెమెరాకు ఫ్లెక్సీని అడ్డుగా కట్టారని, దీనిని కూడా నేరంగా పరిగణిస్తున్నామన్నారు.

అధికారుల అదుపులో సబ్ రిజిస్ట్రార్

సబ్ రిజిస్ట్రార్ సుల్తాన్‌బాషాతో పాటు, కార్యాలయంలో పనిచేసే సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లను ఏసీబీ అధికారులు తమ అదుపులో తీసుకున్నారు. వాస్తవానికి దాడుల కంటే ముందు నుంచే సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నారు. కానీ ఆయన టేబుల్ డెస్క్‌లో రూ.41 వేలు దొరకడం, ఆన్‌లైన్ నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించడంతో అధికారులు ఆయన ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకుని కార్యాలయానికి తీసుకొచ్చారు. అయితే ప్రస్తుతానికి వీరి అరెస్టుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని డీఎస్పీ తెలిపారు. తనిఖీల అనంతరం సబ్ రిజిస్ట్రార్‌ను నెల్లూరుకు తరలించారు.

తప్పించుకున్న కీలక వ్యక్తి

ఈ అవినీతి వ్యవహారంలో నాగేశ్వరరావు అనే వ్యక్తి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రతిరోజు డాక్యుమెంట్ రైటర్ల నుంచి సాయంత్రానికి డబ్బులు వసూలు చేసుకు రావడం, లంచాల రూపంలో వచ్చిన నగదును జాగ్రత్త చేసి అధికారులకు అప్పజెప్పడం ఇతని పని. కాగా అతని కోసం ఏసీబీ అధికారులు ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. అలాగే డాక్యుమెంట్ రైటర్లు రెండో రోజు కూడా కనిపించకుండా పోయారు.

నందవరం మోడల్ స్కూల్లో విచారణ



అధ్యాపకులు, విద్యార్థులను విచారిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : మర్రిపాడు మండలం, నందవరం మోడల్ స్కూల్లో జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, డైట్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు సంయుక్తంగా గురువారం విచారణ చేపట్టారు. గతేడాది సెప్టెంబర్ 7న రాత్రి ఆగంతకులు పాఠశాలలో ప్రవేశించిన విషయమై వారు అధ్యాపకులు, విద్యార్థులను విచారించారు. దీనిపై గతంలో పోలీసులు దర్యాప్తు చేసి ఇచ్చిన నివేదికల ఆధారంగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో వార్డెన్‌గా పనిచేస్తున్న సుభాషిణిని విధుల నుంచి తాత్కాలికంగా తప్పించారు. అయితే ఆమె స్థానంలో ఐదు నెలలుగా ఎవరినీ నియమించలేదు. కాగా విచారణ అనంతరం ఏపీసీ ఉషారాణి విలేకరులకు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. డైట్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాము అన్ని కోణాల్లో విచారించి నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

గాయపడిన యువకుడి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం : బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని కానగచెట్టు కాలనీకి చెందిన నంబూరు శ్రీనివాసులు(27) బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. మండలంలోని సాల్మన్‌పురం వద్ద బుధవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పంచేడు గ్రామానికి చెందిన వికాస్, కానగచెట్టు కాలనీకి చెందిన శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని నెల్లూరులోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.